

అరకు పార్లమెంట్ రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్

పార్వతీపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అరకు పార్లమెంట్ రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్ నిశాంత్‌కుమార్ నియామకమయ్యారు. ఆయన పర్యవేక్షణలో అరకు పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇదిలా ఉండగా జిల్లాకేంద్రంలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఎన్నికల షెడ్యూల్ అమలులోకి వచ్చిన 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయం, ప్రాంగణాల్లో ఉన్న ఫొటోలు, పోస్టర్లు, బ్యానర్లు, బహిరంగ ప్రదేశాల్లో ప్రచార సామగ్రి, హోర్డింగ్‌లను 48 గంటల్లోగా తొలగించాలని సూచించారు. విధిగా ఎన్నిలకల నియమావళిని అమలు చేయాలని ఆదేశించారు.

ములగవలస గ్రామాన్ని ఖాళీ చేసేది లేదని స్పష్టం చేస్తున్న గిరిజనులు (ఫైల్)







భారీ స్కెచ్

- చేతులు మారుతున్న డీపట్టా భూములు
- సుమారు 300 ఎకరాలకు పైబడే..
- పెద్ద ఎత్తున సర్వే చేస్తున్న బృందాలు
- పెత్తందారులకు సహకరిస్తున్న అధికార పార్టీ నేతలు
- మండిపడుతున్న ప్రజా సంఘాలు

పార్వతీపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి)

పార్వతీపురం మండలం వెలగవలస పంచాయతీలో ములగవలస, ములగ పంచాయతీలో సుమారు 300 ఎకరాలకు పైబడి డీపట్టా భూములు చేతులు మారుతున్నాయి. ఆయా భూములకు సంబంధించి పక్కా హక్కులను పొందేందుకు ప్రైవేట్ వ్యక్తులు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా భూములు సాగు చేస్తున్న పేదలకు పూర్తిస్థాయి హక్కులు కల్పించి.. డీ పట్టా అందిస్తామని వైసీపీ సర్కారు తీసుకొచ్చిన ఆదేశాలు.. కొంతమంది వైసీపీ నాయకులకు వరంగా మారిందని చెప్పొచ్చు. దశాబ్దాల కాలంగా డీ పట్టా భూములు సాగు చేస్తున్న, పట్టాలు పొందిన వారి నుంచి అతి చౌకగా గతంలో భూములను కొనుగోలు చేసిన పెత్తందారులు వాటిని సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండగా.. కొంతమంది వైసీపీ నేతలు వారికి సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో గిరిజనుల నుంచి డీ పట్టా భూములు కొనుగోలు చేసిన బడా బాబులు ప్రస్తుతం తమ పేరిట ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయించుకొనేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీనిలో భాగంగానే పార్వతీపురం మండలం ములగ , వెలగవలస పంచాయతీల పరిధిలో రెవెన్యూ సిబ్బంది పెద్ద ఎత్తున సర్వే నిర్వహిస్తున్నారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. బృందాలుగా ఏర్పడి భూముల సర్వే చేస్తున్న వారిపై, ఉన్నతాధికారులపైనా అధికార పార్టీకి చెందిన ఒక ముఖ్య ప్రజా ప్రతినిధి ఒత్తిడి బాగా ఉందని వాదనలు లేకపోలేదు.

వాస్తవంగా గతంలో పట్టాలు పొందిన వారు అనివార్య కారణాలతో సాగు చేయకుండా ఇతరులకు భూములను విక్రయించారు. వాటిని కొనుగోలు చేసిన వారు వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన కొత్త ఆదేశాల ప్రకారం.. పట్టాలు పొందిన వారి పేరిట హక్కులు కల్పించుకొని తిరిగి వారికి ఎటువంటి సొమ్ము ఇవ్వకుండానే ముందస్తు ఒప్పందం ప్రకారం అధికారికంగా వారి భూములను రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగానే గతంలో క్రయ, విక్రయాలు జరిగిన భూములను ప్రస్తుతం సర్వే చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో తక్కువ ధరకు భూములను కొనుగోలు చేసుకున్న పెత్తందారులు అధికార పార్టీ నేతల సాయంతో ఎలాగైనా ఆ భూములను అధికారికంగా సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

కోట్లాది రూపాయల కమీషన్లు...

దశాబ్దాల కిందట విక్రయాలు జరిగిన భూముల్లో తాజా సర్వే పరిస్థితికి కారణం.. అధికార పార్టీ నాయకులకు భూ యజమానుల నుంచి కోట్లాది రూపాయలు కమీషన్ల రూపంలో అందించేందుకు ఒప్పందాలు జరగడమేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. సుమారు 300 పైబడి ఎకరాలకు కొనుగోలు చేసిన భూయజమానులు డీపట్టా పొందిన వారి ద్వారా హక్కులు కల్పించేందుకు ఈ ప్రక్రియ జరుగుతుందని చెప్పొచ్చు.

గ్రామాన్ని ఖాళీ చేయించేందుకు వ్యూహం...

డీ పట్టా భూముల్లో ఇళ్లు కట్టుకున్నారని చెప్పి ములగవలస గ్రామాన్ని ఖాళీ చేయించేందుకు వైసీపీకి చెందిన స్థానిక నేత బాగా ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. దీనిని స్థానిక గిరిజనులు వ్యతిరేకిస్తున్నారు. అయితే ఎలాగైనా ఆ గ్రామాన్ని ఖాళీ చేయించి.. డీపట్టా భూములు కొనుగోలు చేసుకున్న ప్రాప్తికి పక్కా హక్కులు పొందేందుకు స్థానిక వైసీపీ నాయకులతో పాటు ఒక ముఖ్య ప్రజా ప్రతినిధి తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఖాళీ చేసేది లేదు..

ములగవలస గిరిజన గ్రామాన్ని ఖాళీ చేయాలని స్థానిక వైసీపీ నాయకుడు గిరిజనులపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రాణాలు పోయినా ఖాళీ చేసేది లేదు. గిరిజనుల తరఫున పోరాడి తాడోపేడో తేల్చుకుంటాం. సుమారు 1500 ఎకరాలు చేతులు మారాయి. ఎవరో ప్రైవేట్ కంపెనీవారు వాటిని కొనుగోలు చేశారని, వెంటనే గ్రామాన్ని ఖాళీ చేయాలని గిరిజనులను బెదిరిస్తున్నారు.

-రాము, సీపీఎం నాయకుడు, పార్వతీపురం మండలం

నా భూమిని ఆక్రమించేశారు..

నా భర్త కొండ గొర్రె సోములు మరణించారు. ఆయన పేరిట ఉన్న భూమిని ఆక్రమించేశారు. గతంలో మాకు పట్టా ఇచ్చారు. మా భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి. మా భూమిని మాకు ఇప్పించాలి.

-కొండగొర్రె సాయమ్మ, వెలగవలస పంచాయతీ

ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలేవీ?

- కోనేరు రామభద్రాపురం వద్ద తాత్కాలికంగా నిలుపుదల
- బాధ్యులెవరో వెల్లడించని అధికారులు

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని కొమరాడ మండలం కోనేరు రామభద్రాపురం వద్ద అనధికార రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టిందెవరో ఇంకా తేలలేదు. తాత్కాలికంగా ఆ ప్రాంతంలో తవ్వకాలు నిలిపివేసినా.. సర్వత్రా ఇప్పుడిదే చర్చనీయాంశమవుతోంది. అధికార పార్టీకి చెందిన ఉమ్మడి జిల్లా నాయకుడు తెరవెనుక ఉండి ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలను చేపట్టారనే వ్యాఖ్యలు లేకపోలేదు. కాగా అధికారులు ఇంతవరకు ఎవరిపైనా చర్యలు తీసుకోకపోవడంపై జిల్లావాసులు, ప్రజా సంఘాల నాయకులు పెదవి విరుస్తున్నారు. దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితమవగా.. టీడీపీ-జనసేన పార్టీ నాయకులు ఈ ప్రాంతానికి వెళ్లి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని నినదించారు. అనంతరం ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గనులశాఖ అధికారులతో మాట్లాడిన తర్వాత.. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని స్థానిక అధికారులు టీడీపీ-జనసేన పార్టీ నేతలకు హామీ ఇచ్చారు. కానీ రోజులు గడుస్తున్నా.. ఎవరు తవ్వకాలు చేపట్టారనే విషయం ఇంతవరకు తెలియజేయలేదు.

వాస్తవంగా ఆ ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు మైనింగ్ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేవు. అయినప్పటికీ కొంతమంది అధికార పార్టీ పెద్దలు ఆ రీచ్‌పై దృష్టి సారించారు. ఉమ్మడి జిల్లా నాయకుడి అండదండలతో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేపట్టారు. నాగావళి నదీతీర ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపట్టడం వల్ల ఈ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంది. భవిష్యత్‌లో పార్వతీపురం జిల్లా కేంద్రానికి తాగునీరు, తోటపల్లి ఆయకట్టుకు సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఆ ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు బ్రేక్ పడింది. అయితే రానున్న రోజుల్లో తవ్వకాలు చేపట్టకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. అదేవిధంగా కళ్లముందే ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపట్టినా.. ఇంతవరకు మౌనం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇప్పటివరకు నాగావళి నది వద్ద కోనేరు రామభద్రాపురం అనధికార రీచ్ నుంచి ఎంత ఇసుక తరలించారు.. ఎన్ని కోట్లు దోపిడీ చేశారు? అన్న విషయాన్ని అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో తెలియజేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.



విచారణ చేస్తాం..

కోనేరు రామభద్రాపురం వద్ద ప్రస్తుతం ఇసుక తవ్వకాలు జరగడం లేదు. ఆ ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చింది.. లేనిదీ? ఉన్నతాధికారులకు అడిగి తెలుసుకుంటాం. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ విషయంపై విచారణ చేస్తాం. ఆ ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు సంబంధించిన అనుమతి పత్రాలు మా దగ్గర లేవు.

- శ్రీనివాసరావు, గనుల శాఖ జిల్లా అధికారి

పాలకొండను వీడని సస్పెన్స్

- టీడీపీ-జనసేన పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరో?

ఇంకా ప్రకటించని వైనం

పార్వతీపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నియోజకవర్గంలో టీడీపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరన్నదీ ఇంకా తేలలేదు. దీనిపై సస్పెన్స్ కొనసాగుతోంది. గురువారం టీడీపీ అధిష్ఠానం 34 అభ్యర్థులతో కూడిన రెండో జాబితాను విడుదల చేసింది. అయితే అందులో పాలకొండ లేకపోవడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. టిక్కెట్ ఎవరికి కేటాయిస్తారన్నది చర్చనీయాంశమవు తోంది. వాస్తవంగా టీడీపీ గెలుపొందే స్థానాల్లో పాలకొండ ఒకటని చెప్పొచ్చు. ఈ నియోజకవర్గం నుంచి టీడీపీ ఇన్‌చార్జిగా నిమ్మక జయకృష్ణ వ్యవహరిస్తున్నారు. పార్టీ బలోపేతంతో పాటు అధిష్ఠానం నిర్దేశించిన అనేక కార్యక్రమాలను జయకృష్ణ చురుగ్గా నిర్వహించారు. అయితే రెండో జాబితాలో కూడా పాలకొండ స్థానం నుంచి ఎవరు పోటీ చేస్తారో ఖరారు కాలేదు. దీంతో నియోజకవర్గం అభ్యర్థి ఎవరనే సందేహం టీడీపీ-జనసేన పార్టీ నాయకుల్లో నెలకొంది. ఒకానొక దశలో జనసేన పార్టీకి ఈ స్థానాన్ని కేటాయిస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఒకవేళ జనసేనకు కేటాయిస్తే ఓటు వేసే సమయంలో గిరిజన ప్రాంతాల్లో కొంత గందరగోళం ఏర్పడే పరిస్థితి ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

టెన్త్ పరీక్షలకు సన్నద్ధం

- జిల్లాలో 66 కేంద్రాలు ఏర్పాటు
- హాజరుకానున్న 11,198 మంది విద్యార్థులు

సాలూరు రూరల్, మార్చి 14: జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. మొత్తంగా 66 కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 210 ఉన్నత పాఠశాలల నుంచి 11,198 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. 66 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 66 మంది డిపార్టమెంట్ అధికారులు, మూడు ఫ్లయింగ్ స్కాడ్లు నియమించారు. సిట్టింగ్ స్క్వాడ్లు సైతం ఉంటాయి. 518 మంది ఇన్విజిలేటర్లను నియమించగా, వారు అన్ని పరీక్షలకు ఉండరు. మూడు పరీక్షలు అనంతరం కొత్తవారిని నియమించనున్నారు. తొలి విడత ఇన్విజిలేటర్లకు గురువారం సీఆర్పీలు ఆదేశాలను అందించారు. పరీక్ష హాల్‌లోకి సీఎస్, డీవోలతో సహా ఎవరు మొబైల్ ఫోన్లు తీసుకెళ్లరాదు. ఈ పరీక్షలు ఈ నెల 18 నుంచి 27 వరకు జరగనున్నాయి. 28,30 తేదీల్లో ఓకేషనల్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరగనుంది. ఈ ఏడాది టెన్త్ పరీక్షలను ఏడు పేపర్లు (సైన్స్‌కు రెండు పేపర్లు)తో నిర్వహించనున్నారు. గతేడాది ఆరు పేపరులతో పరీక్షలను నిర్వహించారు. సైన్స్ పరీక్షకు పేపరు ఒక్కటే అయిన 12 పేజీల చొప్పున రెండు బుక్‌లెట్‌లిచ్చి భౌతికశాస్త్రం, జీవశాస్త్రం వేర్వురుగా రాయించారు. ఈ విధానంలో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడడంతో మళ్లీ సైన్స్‌కు వేర్వేరుగా రెండు పేపర్లతో ఈ ఏడాది మొత్తంగా ఏడు పేపర్లతో పరీక్షలను నిర్వహించనున్నారు. జిల్లాలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఏ,బీ,సీ కేటగిరీలుగా విభజించారు. జిల్లాలో 22 సీ కేంద్రాలున్నాయి. అన్ని పరీక్ష కేంద్రాల పరిధిలో ఈ నెల 18 నుంచి 144 సెక్షన్ అమలు కానుంది. ఇప్పటికే ప్రశ్న పత్రాలు పోలీస్‌స్టేషన్లుకు చేరాయి. పరీక్ష కేంద్రాల వద్ద వైద్యశిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ పరీక్షలకు విద్యార్థులు మొబైల్స్, స్మార్ట్‌వాచ్‌లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ తీసుకురాకూడదు. విద్యార్థులకిచ్చే ప్రశ్నపత్రంలో ఏడు సంఖ్యల సీరియల్ కోడ్ ఉంటుంది. పేపర్ లీకయితే ఈకోడ్ బట్టి ఏ సెంటర్లులో లీకయ్యిందో స్పష్టం కావడంతో అక్కడ సీఎస్, డీవో, ఇన్విజిలేటర్ తదితరులను బాధ్యులను చేయనున్నారు.



పాచిపెంటలో టీచర్లకు ఇన్విజిలేషన్ ఆర్డర్ ఇస్తున్న ఎంఈవో కార్యాలయ సిబ్బంది

జ్వరంతో గిరిజన బాలిక మృతి

- శోకసంద్రంలో తల్లిదండ్రులు
- మరణాలను కట్టడి చేయాలని ప్రజా సంఘాల డిమాండ్

కొమరాడ, మార్చి 14 : కొమరాడ మండలం అంటివలసకు చెందిన ఊయక తేజశ్రీ (7) అనే గిరిజన బాలిక జ్వరంతో బాధపడుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. దీంతో తల్లిదండ్రులు వెంకటేష్, లావణ్య బోరున విలపిస్తున్నారు. ఆ దంపతులకు ముగ్గురు సంతానం కాగా.. పెద్ద కూతురు మరణాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అంటివలసకు చెందిన తేజశ్రీ స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. అయితే గత రెండు రోజులుగా జ్వరంతో బాధప డుతున్న బాలికను స్థానిక వైద్యులకు చూపించినా ఫలితం లేకపోయింది. చివరకు తేజశ్రీ మరణించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. గిరిజన గ్రామాల్లో క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వారితో పాటు గ్రామస్థులు కోరుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్, వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ గిరిజనుల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తు న్నామని వైసీపీ ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం విద్యార్థుల మరణాలు ఆగడం లేదు. వరుసగా ఘటనలు చోటుచేసుకోడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి గిరిజన విద్యార్థుల మరణాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని గిరిజన సంఘాల నాయకులు, ఆ ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు



గిరిజన బాలిక తేజశ్రీ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కాగితాలపైనేనా అభివృద్ధి?

- చైర్‌పర్సన్, అధికారుల తీరుపై నిప్పులు చెరిగిన టీడీపీ కౌన్సిలర్లు
- తన వార్డులో ఏం చేశారని వైసీపీ కౌన్సిలర్ ఆవేదన
- వాడీవేడిగా పార్వతీపురం మున్సిపల్ సమావేశం

పార్వతీపురం టౌన్, మార్చి 14 : పార్వతీపురం మున్సిపాల్టీలో సమస్యలపై టీడీపీ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. చైర్‌పర్సన్ గౌరీశ్వరితో పాటు సంబంధిత అధికారులపై నిప్పులు చెరిగారు. వైసీపీ సర్కారు పాలనలో పట్టణాభివృద్ధి కాగితాలకే పరిమితమైందన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని పాలకవర్గ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, 14వ వార్డు కౌన్సిలర్ డి.శ్రీదేవి, టీడీపీ కౌన్సిలర్లు టి.వెంకటరావు, బి.గౌరునాయుడు మాట్లాడుతూ.. 'ఏటాలానే ఈ సారి కూడా పట్టణంలో మూడు నుంచి నాలుగు రోజులకొకసారి నీటి సరఫరా చేస్తున్నారు. దీంతో 30 వార్డుల్లో ప్రజలు తాగునీటి కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. పట్టణ శివారు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా కోసం ఏటా రూ. 3 నుంచి రూ.4 లక్షలు అద్దె ప్రాతిపదికన ట్యాంకర్లకు చెల్లించడం దారుణం. ఆ మొత్తంతో కొత్తవి కొనుగోలు చేస్తే మున్సిపాల్టీకి ఎంతో ఉప యుక్తం.' అని వారు తెలిపారు. పట్టణంలో కర్షక మహర్షి ఆసుపత్రికి వెళ్లే రహదారిలో వరహాల గెడ్డపై వంతెన నిర్మాణానికి పాలకవర్గ సభ్యులందరూ అనుమతిస్తే.. 'మీరెందుకు అడ్డుకట్ట వేస్తున్నారు' అని చైర్‌పర్సన్‌ను వారు నిలదీశారు. పట్టణంలో పారిశుధ్యం క్షీణించిందని, కనీసం కాలువల్లో పూడికలు తీయడం లేదని, దోమల నివారణకు ఫాగింగ్ కూడా చేపట్టడం లేదని తెలిపారు. చేపల మార్కెట్ అభివృద్ధికి రూ. 3.40 లక్షలతో అంచనా వేయడం సరికాదన్నారు. గత టీడీపీ ప్రభు త్వ హయాంలో రూ.20 లక్షలతో ప్రధాన చేపల మార్కెట్‌ల అభివృద్ధికి అంచనా వేస్తే వైసీపీ సర్కారు దానిని బుట్టదాఖలు చేసిందన్నారు. మార్కెట్ ఆశీలుకు సంబంధించి ఇప్పటి వరకు 8 సార్లు బహిరంగ వేలం పాట వాయిదా పడడం దారుణమని తెలిపారు. ఈ తప్పిదం పాటదారులదా? లేక రెవెన్యూ అధికారులదా! అని టీడీపీ 8వ వార్డు కౌన్సిలర్ నారాయణరావు తదితరులు ప్రశ్నించారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి రూ. 25వేలు, రూ.50 వేలు చెల్లించిన లబ్ధిదారులు అయోమయ పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఆ సమస్య ను హౌసింగ్ ఎమ్‌డీకి తెలియ జేశామని కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. స్థలాలు చూపించి పట్టాలు ఇవ్వని లబ్ధిదారులకు న్యాయం చేయాలని టీడీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.



పట్టణ సమస్యలపై చైర్‌పర్సన్, అధికారులను ప్రశ్నిస్తున్న 14వ వార్డు టీడీపీ కౌన్సిలర్ శ్రీదేవి

స్వపక్షంలో.. విపక్షం

'నా వార్డులో గత మూడేళ్లుగా ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదు. వైసీపీ కౌన్సిలర్‌గా గెలిచినప్పటికీ.. ప్రయోజనం లేకుండా పోయింది. ప్రజాప్రతినిధిగా ఎందుకు ఎన్నికయ్యానా? అనిపిస్తోంది. నా వార్డులో తాగునీరు, రహదారులు, కాలువలు, పారిశుధ్య నిర్వహణ సమస్యలను పరిష్కరించాలని విన్నవించుకున్నా.. పట్టించుకోకపోవడం విచారకరం.. నా వార్డు పరిధిలో బైపాస్ రహదారి డంపింగ్ యార్డుగా మారుతుందని.. ప్రజారోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదు.' అని 13వ వార్డు వైసీపీ కౌన్సిలర్ వి.కృపాబాయి అన్నారు. అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ల వార్డుల్లో అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి.. కానీ అదే పార్టీలో తాను ఉన్నప్పటికీ తమ వార్డులో పరిస్థితి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉందన్నారు. తమ వార్డులో అభివృద్ధి పనులకు ఏ మేరకు నిధులకు మంజూరు చేశారో చైర్‌పర్సన్‌తో పాటు అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమావేశం మందిరం నుంచి వెళ్లిపోతున్న చైర్‌పర్సన్‌ను ఉద్దేశించి.. తన వార్డును అభివృద్ధి చేస్తారా లేదా? అని ఆమె ప్రశ్నించారు. అధికారులతో చర్చించి నిధులు మంజూరు చేస్తామని చైర్‌పర్సన్ చెప్పారు. అయితే చైర్‌పర్సన్ తీరుపై మిగతా అధికార పార్టీ కౌన్సిల్ సభ్యులు కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు.



తన 13 వ వార్డులో అభివృద్ధి పనులేవీ జరగలేదని చెబుతున్న వైసీపీ కౌన్సిలర్ కృపాబాయి

వైసీపీ సేవలో వలంటీర్లు

- సీఎం జగన్ ఫొటోతో ఉన్న టీషర్టులు వేసుకుని మరీ సర్వే

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి/కొమరాడ, మార్చి 14)

జిల్లాలో వలంటీర్లు వైసీపీ సర్కారు సేవలో నిమగ్నమైపోతున్నారు. సీఎం జగన్ ఫొటోతో ఉన్న టీ షర్టులు వేసుకుని మరీ సర్వే చేస్తున్నారు. తాజాగా కొమరాడ మండలం పూడేసు పంచాయతీ తీలేసు గ్రామంలో ఇంటింటి ప్రచా రం చేశారు. ఇదే సమయంలో 'మీ ఇంటిలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు' అని ఆరా తీశారు. ఎవరెవరికి సంక్షేమ పథకాలు అందాయో తెలియజేస్తూ.. వచ్చే ఎన్నికల్లో జగన్ పార్టీ ఓటు వేయాలని కోరారు. అయితే దీనిపై ప్రతిపక్ష, ప్రజా సంఘాల నాయకులు మండిపడుతున్నారు. కొమరాడ మండలం పూడేసు పంచాయతీ తీలేసు, గుమడంగి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వైసీపీ తరఫున ప్రచారం, సర్వే చేసిన వలంటీర్లపై చర్యలు తీసుకోవాలని కొమరాడ మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై కొమరాడ ఎంపీడీవో మల్లికార్జునరావును వివరణ కోరగా.. ఏ పార్టీ కార్యక్రమాల్లో కూడా వలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనరాదని తెలిపారు. వలంటీర్లు రాజకీయ పార్టీల ప్రచారాల్లో పాల్గొంటే చర్యలు తప్పవన్నారు.

మరికొన్ని చోట్ల ఇలా..

- కొన్ని నియోజకవర్గాల్లో వలంటీర్లతో పాటు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను సైతం వైసీపీ నేతలను వదలడం లేదు. వైసీపీకి ఓటు వేసే విధంగా వేతనదారులకు చెప్పాలని చెబుతున్నారు. ఇటీవల ఒక నియోజకవర్గంలో ఎమ్మెల్యే తన స్వగృహంలో వారితో సమావేశం ఏర్పాటు చేసి మరీ ఇదే విషయం చెప్పినట్లు సమాచారం. ఇక గ్రామాల్లో వీవోఏలకు కూడా వైసీపీ నేతలు గాలం వేస్తున్నారు. ఈ నెల 15న జిల్లాలోని ఒక నియోజకవర్గ ఎమ్మెల్యే వీవోఏలతో సమావేశం ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.



కొమరాడ మండలం తీలేసు గ్రామంలో సర్వే చేస్తున్న వలంటీర్లు

విద్యార్థిని ఆత్మహత్య


జి.మానస (ఫైల్)

బొబ్బిలి: బొబ్బిలి మండలం అలజంగి గ్రామానికి చెందిన విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు అలజంగికి చెందిన జి.మానస (16) స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకుంటోంది. గురువారం తెల్లవారుజామున తమ ఇంటి స్లాబ్‌కు గల ఇనుప కొక్కేనికి చీరతో ఉరి పోసుకొని మృతి చెందింది. బాలిక తాత చూసి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు చూసి కన్నీరుమున్నీరయ్యారు. పరీక్షలు దగ్గర పడుతుండడంతో టీవీ, సెల్ చూడవద్దని.. బాగా చదువుకోవాలని తల్లిదండ్రులు చెప్పడంతో మానస మనస్తాపంతో ఈ అఘాయిత్యానికి పాల్పడిందని భావిస్తున్నట్టు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని... కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చదలవాడ తెలిపారు. మృతురాలికి తండ్రి శంకరరావు, తల్లి, తమ్ముడు ఉన్నారు.

దేవుపల్లిలో మరొకరు...

బొండపల్లి: దేవుపల్లిలోని యాదవ కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థిని కడుపు నొప్పితో బాధపడుతూ గురువారం వేకువజామున ఆత్మహత్య చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ కె.లక్ష్మణరావు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రాజాన రూప(20) గజపతినగరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. తండ్రి సూర్యనారాయణ మృతిచెందగా అమ్మమ్మ మురపాక సూరమ్మ సంరక్షణలో ఉంటూ చదువుకుంటోంది. కొద్ది నెలలుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతోంది. గురువారం వేకువజామున కూడా కడుపునొప్పి రావడంతో ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి అమ్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆసుపత్రికి తరలించారు.

ట్రాక్టర్ బోల్తా.. ముగ్గురికి గాయాలు

కురుపాం రూరల్: ఇటుకల లోడుతో కురుపాం వస్తున్న ట్రాక్టర్ కస్పాగదబవలస గ్రామం వద్ద బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కూలీలు జి.గోపయ్య, కె.పోసయ్య, ఎం.సింహాచలంకు గాయాలయ్యాయి. కూలీలు అంతా వీరఘట్టం మండలం నడిమికెల్ల గ్రామానికి చెందినవారు. గాయపడిన వారికి కురుపాం ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం తరలించారు. కురుపాం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బెల్లం ఊటల ధ్వంసం

వంగర: వీవీఆర్ పేటలో గురువారం సాయంత్రం ట్రైనీ డీఎస్పీ మహేంద్ర తన సిబ్బందితో దాడులు నిర్వహించి 2,600 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం చేశారు. 30 లీటర్ల నాటు సారా గుర్తించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనువాసరరావు, ఎస్ఐ జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

దాసన్నపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు పిలుపునిచ్చారు. గురువారం కోట జంక్షన్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాము, రమణ, త్రినాథ్, కనకమహాలక్ష్మి, రాకోటి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జాతీయ లోక్అదాలత్

శృంగవరపుకోట: శృంగవరపుకోట కోర్టులో శనివారం జాతీయ లోక్అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.వాణి తెలిపారు. రాజీ కాగలిగిన సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను పరిష్కరించుకోవచ్చున్నారు.

ఉపాధి వేతనదారులకు సామగ్రి పంపిణీ

బాడంగి: పిండ్రంగివలస గ్రామంలో గురువారం రౌతు సురేష్ తల్లిదండ్రులైన మాజీ సర్పంచ్ రౌతు లక్ష్మంనాయుడు, సింహాచలమ్మల జ్ఞాపకార్థం జనసేన బొబ్బిలి ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి చేతులమీదుగా ఉపాధి వేతనదారులకు సామగ్రి పంపిణీ చేశారు. జనసేన ఇన్‌చార్జి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి రూ.10వేలు విరాళంగా అందజేశారు. జనసేన మండల వైస్ ప్రెసిడెంట్ గంట్రెడ్డి శ్రీనివాసరావు, రామకృష్ణ, రౌతు సింహాచలం, కృష్ణ, తాడ్డి రాము, బుసర సత్యనారాయణ, గన్నేద సత్యనారాయణ, కొత్తల నారాయణరావు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

లక్కవరపుకోట (కొత్తవలస): స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు బార్ అసోసియేషన్ కార్యదర్శి గిరిబాబు తెలిపారు. మెడికవర్ ఆసుపత్రి సహకారంతో బార్ అసోసియేషన్, రామదండు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. న్యాయవాదుల కుటుంబాలు, కోర్టు సిబ్బంది కుటుంబాలు, కక్షిదారులు, అర్జీదారుల కుటుంబాలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కంటి వ్యాధులపై అవగాహన

లక్కవరపుకోట (కొత్తవలస): వియ్యంపేటలో గల అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం కంటి వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.జయశ్రీ ఆధ్వర్యంలో వైద్యుడు ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు విద్యార్థులకు కంటి సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన టెక్నికల్ సింపోజియం

విజయనగరం రూరల్ : నగర శివారులోని జేఎన్టీయూ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న నేషనల్ లెవల్ టెక్నికల్ సింపోజియం ప్రతీక్ష 2కె-2024 కార్యక్రమం గురువారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ జయసుమ మాట్లాడుతూ విద్యార్థులు తమ నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గీతం యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సునీల్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి శ్రీనివాస్ ప్రసాద్, బాలమురళీకృష్ణ, ఫణీంద్రనాథ్‌తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

బాడంగి: రానున్న ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.తిరుమలరావు కోరారు. ఈ మేరకు గురువారం పినపెంకి, వాడాడ గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆర్.జయంతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తర్వులు అమలు చేయాలి

లక్కవరపుకోట: మండలంలోని 7 పంచాయతీలకు సంబంధించిన గ్రేడ్-5 కార్యదర్శులకు డీడీవోలుగా అధికారం ఇస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. సంబంధిత ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని కోరుతూ గురువారం ఎంపీడీవో కె.రూపేష్‌కు ఏడుగురు కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. రంగాపురం, పోతంపేట, లింగంపేట, సంతపేట, గేదెలవానిపాలెం, తలారి శ్రీరాంపురం పంచాయతీల కార్యదర్శులకు డీడీవోలుగా నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎవరికి టిక్కెట్ ఇచ్చినా పనిచేస్తాం

శృంగవరపుకోట: శృంగవరపుకోట నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు తెలుగుదేశం పార్టీ ఎవరికి టిక్కెట్‌ను కేటాయించినా గెలుపు కోసం పనిచేస్తామని ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ గనివాడ సంతోషి కుమారిలు తెలిపారు. గురువారం వీరు విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల వైసీపీ నుంచి వీరు టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే టిక్కెట్ కోసం మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, ఎన్ఆర్ఐ గొంప కృష్ణలు పోటీ పడుతుండడంతో వారు ఈమేరకు స్పష్టత ఇచ్చారు.

ఆరోగ్యవంతమైన ప్రజాస్వామ్యం కోసమే ఓటు

విజయనగరం: ఆరోగ్యవంతమైన ప్రజాస్వామ్యం కోసం ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎమ్‌వీజీఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీఎస్ సీతారామరాజు పిలుపునిచ్చారు. ఎమ్‌విజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు ఓటు హక్కుపై గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమర్థవంతమైన నాయకులను ఎన్నుకునేందుకు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.మోహన్ కుమార్, ఎమ్.అనీల్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు తప్పనిసరి

రాజాం రూరల్: ప్రతిఒక్కరూ రెండేళ్లకోసారి నేత్ర పరీక్షలు చేయించుకోవడం ద్వారా గ్లకోమా వ్యాధి ద్వారా సంభవించే అంధత్వం నుంచి బయటపడవచ్చని ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు స్పష్టం చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని మదర్‌థెరిసా నర్సింగ్ కాలేజీలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నేత్ర వైద్యనిపుణుల సలహాలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామా టీడీపీ


పార్టీలో చేరిన వారితో అదితి గజపతి తదితరులు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో దేశానికి తలమానికం తెలుగుదేశం ప్రభుత్వమని... పేదవాడు ఆత్మగౌరవంగా బతకాలన్నదే ఎన్టీఆర్ ఆశయని టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి పూసపాటి అదితి విజయలక్ష్మీ గజపతిరాజు అన్నారు. గురువారం నగరంలోని 1, 14వ డివిజన్‌లకు చెందిన సుమారు 80 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరిలో 18వ డివిజన్ కార్పొరేటర్ మీసాల రమాదేవి తల్లిదండ్రులు కూడా అదితి నాయకత్వాన్ని బలపరిచారు. ఈ సందర్భంగా అదితి మాట్లాడుతూ టీడీపీలో అశోక్ గజపతిరాజు సుదీర్ఘ కాలంగా ఉన్నారని.... పేదవారు ఆత్మగౌరవంతో బతకాలని... పక్కాఇళ్లు వారికి ఉండాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. తెలుగుదేశంలో ప్రతిఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని చెప్పారు. కార్యకర్తలంతా నారా చంద్రబాబునాయుడుని అధికారంలోకి తీసుకొచ్చే దిశగా పనిచెయ్యాలని పిలుపునిచ్చారు. అవనాపు విజయ్ మాట్లాడుతూ నగరంలో వైసీపీకి ఇవే చివరి ఎన్నికలని, భవిష్యత్ అంతా..టీడీపీదేనన్నారు. కాళ్ల గౌరీశంకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిపై నగర ప్రజలు విరక్తి చెందారని... అందుకే వందలాది కుటుంబాలు టీడీపీని గెలిపించేందుకు పార్టీలో చేరుతున్నాయన్నారు. తెలుగుదేశం పార్టీలోకి వచ్చిన వారిని అదితి గజపతి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, పిళ్లా విజయ్‌కుమార్, నగర మాజీ యువత అధ్యక్షుడు కర్రోతు నర్సింగరావు, పతివాడ రాము, పతివాడ పార్వతి, ఆవాల అప్పలస్వామి, రోహిణి కుమార్ తదితరులు స్వాగతించారు.

వైసీపీ భూస్థాపితం కావడం ఖాయం..

రాజాం: త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీ భూస్థాపితం కావడం ఖాయమని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. అరసాడ గ్రామానికి చెందిన పలు కుటుంబాలు గురువారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కోండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు లేక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిన్నింటి మోహన్‌రావు, లచ్చుభక్త కృష్ణమూర్తి, మజ్జి వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు. వైసీపీ నుంచి రాయిపల్లి అప్పలనాయుడు, రాయిపల్లి రమణ, గౌరీనాయుడు, కడగల జగన్నాథం, ఇప్పిలి వెంకటేష్, గంగులు, కాంబోతుల అప్పలనాయుడు, నారాయణరావు తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా రాజాం పురపాలక సంఘ పరిధిలోని ఆరో వార్డులో కోండ్రు మురళీమోహన్ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సారధి రోడ్డులోని దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు కేక్ పంచిపెట్టారు. కార్యక్రమంలో నంది సూర్యప్రకాష్‌రావు, వంగా వెంకటరావు, అడపా శ్రీను తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో కోండ్రు మురళీమోహన్

చంద్రబాబును సీఎంగా చేయడమే లక్ష్యం

● చిన్నయ్యపేటలో 50 కుటుంబాలు టీడీపీలో చేరిక


చిన్నయ్యపేటలో టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి కోండ్రు

రేగిడి : రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం పాడి...మళ్లీ చంద్రబాబును సీఎంను చేయడమే లక్ష్యం కావాలని మాజీ మంత్రి కోండ్రు మురళీమోహనరావు సూచించారు. చిన్నయ్యపేటలో సీతమ్మ తల్లి ఆలయ సంబరాల్లో గురువారం కోండ్రు పాల్గొన్నారు. అనంతరం వైసీపీకి చెందిన కోట కంచంనాయుడు, కొమరాపు పండు సూర్యారావు, శింగిపురపు లక్షుంనాయుడు, శింగిపురపు చిన్నసత్యనారాయణ తదితర 50 కుటుంబాలు కోండ్రు సమక్షంలో టీడీపీలో చేరినట్లు ప్రకటించారు. గ్రామంలో టీడీపీ కార్యకర్తలు, అభిమానులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, మజ్జి శ్రీనివాసరావు, గురవాన రమేష్, గేదల బాలమురళీధర్, మాజీ జెడ్పీటీసీ మంతిన ఉషారాణి, గురువాన ధనంజయ్, సంకిలికి చెందిన కర్రి రమణ, నారు జనార్దనరావు, రాజాం, చిన్నయ్యపేట టీడీపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 80 ఏళ్ల వృద్ధురాలు సవిరిగాన వరహాలమ్మ... కోండ్రు విజయం సాధించాలని ఆశీర్వదించడం ఆకట్టుకుంది. ఇదిలా ఉండగా..ఉంగరాడమెట్ట సెంటర్‌లో గురువారం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రారంభించారు. టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహనరావు స్థానిక క్యాడర్‌తో కలిసి రిబ్బన్ కట్ చేసి పార్టీ కార్యాలయం ప్రారంభించారు.


ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ-జనసేన నేతలు, కార్యకర్తలు

అరాచక పాలనకు స్వస్తి పలకండి

లక్కవరపుకోట (కొత్తవలస): రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలనకు స్వస్తి చెప్పాల్సిన రోజు వచ్చిందని ఎస్.కోట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోళ్ల లలిత కుమారి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో జనసేన 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని నియోజకవర్గ సమన్వయకర్త ఒబ్బిన సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోళ్ల..సీఎం జగన్‌పై మండిపడ్డారు. రాష్ట్ర భవిష్యత్, ప్రజా అవసరాల కోసం కూటమి ఏర్పడిన విషయాన్ని ఆమె ప్రజలకు వివరించారు. ఇరు పార్టీల జెండాలు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్.చినరాము, ఇర్ర వెంకటలక్ష్మి, కుమారి, జన సైనికులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటా..

జామి: పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పల కాపాడుకుంటానని టీడీపీ అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని టీడీపీ కార్యకర్త ఎన్నింటి అప్పలరాజు తల్లి చనిపోవడంతో.. ఆ కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. అనంతరం కార్యకర్తలు, ముఖ్య నాయకులతో మాట్లాడుతూ ఎవరికి ఎటువంటి ఇబ్బందులు వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జామి, గజపతినగరం మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి శ్రీనివాస్

నీరు.. రోడ్లు.. లేవు!

● టిడ్కో ఇళ్లలో దిగిపోండి
● తాళాలు అప్పగించేస్తాం..
● మున్సిపల్ చైర్మన్ సూచన
● తిరస్కరించిన లబ్ధిదారులు

బొబ్బిలి: 'టిడ్కో సముదాయంలో 144 ఇళ్లు నూరుశాతం పూర్తయ్యాయి. రోడ్లు, నీరు మాత్రమే లేవు. ఆ ఇళ్లలో దిగిపోతే తాళాలు అప్పగించేస్తామ'ని మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు, వైసీపీ నాయకులు, కమిషనర్ లాలం రామలక్ష్మి లబ్దిదారులకు తెలిపారు. అన్ని వసతులు కల్పించిన తరువాతనే అప్పగించాలంటూ వారు తిరస్కరిచండంతో వైసీపీ నాయకులు, అధికారులు కంగుతిన్నారు. 'ఇళ్లను పూర్తి చేయడానికి ఇన్నేళ్లు టైమ్ చాలలేదా? ఎన్నికల ముందు మీకు గుర్తుకొచ్చాయా? మాకు ఇళ్లను అప్పగించకుండానే బ్యాంకుల నుంచి అప్పులు చెల్లించాలని నోటీసులు వచ్చేస్తున్నాయి' అంటూ మహిళా లబ్ధిదారులు ప్రశ్నించడం వైసీపీ నాయకులకు మింగుడు పడలేదు. వివరాలివీ... స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టిడ్కో లబ్ధిదారులతో కమిషనర్ లాలం రామలక్ష్మి గురువారం సమావేశం నిర్వహించారు. మొత్తం 1248 ప్లాట్లకు గాను 144 ఇళ్లు (డబుల్ బెడ్‌రూమ్) నూరు శాతం పూర్తయిపోయాయన్నారు. రోడ్లు, నీటి సదుపాయం తప్ప నిర్మాణ ప్రక్రియ దాదాపు పూర్తయిందని, అందరికీ సమ్మతమైతే తాళాలు అప్పగిస్తామని చెప్పారు. దశల వారీగా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. దీనికి ఎవరూ అంగీకరించలేదు. మర్రి నరేష్ రెడ్డి పద్మ, చిప్పాడ పద్మ, రమేష్ తదితరులు మాట్లాడుతూ నాయకులు, అధికారుల ప్రతిపాదనను తిరస్కరించారు. చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు మాట్లాడుతూ పది శాతమే పనులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ చోడిగంజి రమేష్‌నాయుడు, జేఈలు స్వాతి, నవీన్, కాంతారావు, వైస్‌చైర్మన్లు చెలికాని మురళీకృష్ణ, గొలగాని రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ

శృంగవరపుకోట రూరల్: ధర్మవరం గ్రామానికి చెందిన మోడే హర్ష తన తండ్రి రాముునాయుడు జ్ఞాపకార్థం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులకు పరీక్షల సామాగ్రి అందించారు. 8, 9, 10 విద్యార్థులకు జామెట్రీ బాక్సులను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఉమమహేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

బొబ్బిలి: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం బొబ్బిలి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జనసైనికులు, వీరమహిళలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం కేక్‌ను కట్ చేశారు. ఆయనకు పార్టీ నాయకులు కేక్ తినిపించారు. గిరడ మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నాయకత్వంలో ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపించడం ఖాయమని అన్నారు. టీడీపీ- జనసేన కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అనంతరం పార్టీ నాయకులు పెద్దింటి మనోజ్‌కుమార్ (బాబీ), లంక రమేష్‌ల ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించారు. వీరమహిళలకు చీరలు, మొక్కలు పంపిణీ చేశారు. వీరమహిళ నాయకురాలు బంటుపల్లి దివ్య, రామభద్రపురం మండల పార్టీ అధ్యక్షుడు భవిరెడ్డి మహేశ్, పైలా హరిప్రసాద్, చిక్కాల సందీప్, ఉల్లి సంతోష్, అల్లు రమేష్, సూర్య నారాయణ, జమ్ము గణేశ్ పాల్గొన్నారు.

గోస్తనీ కేంద్రంగా ఇసుక దోపిడీ


అంబదాసుపాలెం వద్ద ఇసుక ట్రాక్టర్

శృంగవరపుకోట రూరల్: బొడ్డవరలో ఒక అధికార పార్టీ చోటా నేత అనుచరులుగా చెప్పుకుంటూ కొందరు ఇసుక దోపిడీకి తెరలేపారు. బహిరంగంగా ఇసుకను తరలిస్తున్నారు. వివరాల్లోకి వెళితే... అల్లూరి సీతారామ రాజు జిల్లా చిలకలగెడ్డ, విజయనగరం జిల్లా బొడ్డవరను ఆనుకొని గోస్తనీ నది ప్రవహిస్తోంది. ఈ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు అధికార పార్టీ చోటా నేతల అండ తమకు ఉందని అక్రమాలకు తెర తీస్తున్నారు. ఐతన్నపాలెం కేంద్రంగా ట్రాక్టర్లతో పట్టపగలు ఇసుక రవాణా చేస్తున్నారు. అధికారులు వీరి పైపు కన్నెత్తి చూసే సాహసం చేయకపోవడంతో రోజుకు 15 ట్రాక్టర్ల వరకు ఇసుకను వివిధ ప్రాంతాలకు తరలిస్తూ రూ.లక్షలు సంపాదిస్తున్నారు. గురువారం ఈ ఇసుక తరలింపు దృశ్యాలు 'ఆంధ్రజ్యోతి' ఫొటోలు తీయగా... ఐతన్నపాలెం గ్రామానికి చెందిన రాజుగారిదని ట్రాక్టర్ డ్రైవర్ చెప్పడం విశేషం. అదే సమయంలో సదరు రాజు వచ్చి 'మనల్ని ఎవ్వడూ ఏం చేయలేడు... పద' అంటూ ఇసుకను లోడ్ చేయించి తన ట్రాక్టర్‌ను వెంట తీసుకెళ్లిపోవడం గమనార్హం.

సీఎం పదవికి జగన్ అనర్హుడు

● మాజీ మంత్రి కోండ్రు


సీఎం జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కోండ్రు మురళీమోహన్

రేగిడి/రాజాం: ఏపీపీఎస్సీ ఉద్యోగాలను వైసీపీ సర్కారు అమ్ముకొని రూ.150 కోట్లు స్కామ్‌కు పాల్పడ్డారని ఆరోపిస్తూ మాజీ మంత్రి కోండ్రు మురళీమోహనరావు, తన అనుచరులు రోడ్డెక్కారు. సీఎం పదవికి జగన్ మోహన్‌రెడ్డి అనర్హుడు అంటూ మండలంలోని ఉంగరాడ మెట్ట కూడలి, రాజాంలోని పార్టీ కార్యాలయం వద్ద గురువారం ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో వైసీపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. గ్రూప్ 1 నోటిఫికేషన్ మరోసారి ఇచ్చి..ఉద్యోగాలు భర్తీ చేయాలని హైకోర్టు తీర్పు ఇవ్వడాన్ని బట్టి ప్రభుత్వ అవినీతి బయట పడిందని ఆయన ఆరోపించారు. ఒక్కొక్క పోస్టును రూ.కోట్లకు అమ్ముకొన్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో రూ.150 కోట్లు చేతులు మారాయని... ఇందులో ప్రభుత్వ పెద్దలే తిమింగలాలుగా ఉన్నారని నిప్పులు చెరిగారు. ఈ నిరసనలో రాజాం నియోజకవర్గ నేతలు గురవాన నారాయణరావు, దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, మజ్జి శ్రీనివాసరావు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు చెంపపెట్టు..

విజయనగరం రూరల్: ఏపీపీఎస్సీ భ్రష్టుపట్టించిన సీఎం జగన్‌కు హైకోర్టు ఇచ్చిన తీర్పు చెంప పెట్టని టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి గవర భరత్ విమర్శించారు. వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గురువారం నగరంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ నిరుద్యోగులను వైసీపీ ప్రభుత్వం నిండా ముంచిందన్నారు. ఆ పార్టీని ఇంటికి పంపించే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు గెదెల సతీష్, షైలపల్లి వాసు, టీకేఎల్ రాజు, కాళ్ల గౌరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్ల్‌మార్క్స్ వర్ధంతి

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో గురువారం కార్ల్‌మార్క్స్ వర్ధంతిని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కేశవరావు, అధ్యాపకులు ప్రసాదరావు, షేక్ వలీఖాన్, శ్రీలక్ష్మి, బాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికావలసలో రక్త నమూనాల సేకరణ

రేగిడి: బాలికావలసలో రాజాం జీసీఎఫ్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ సేవా విభాగం ఆధ్వర్యంలో ఆరో రోజు గురువారం రక్తనమూనాల గుర్తింపు (బ్లడ్ గ్రూపింగ్) శిబిరం నిర్వహించారు. రాజాం రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు కొత్త సాయి ప్రసాద్, పెంకి చైతన్యకుమార్‌లు ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు పరీక్ష సామగ్రి పంపిణీ

రేగిడి: దేవుదళ కేజీబీవీ పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్న 44మంది విద్యార్థినులకు సంకిలి ఇఐడీఈప్యారీ షుగర్స్ బాసటగా నిలిచింది. వారికి అవసరమైన ప్లాంక్, ఇతర సామగ్రిని సుగర్ ఫ్యాక్టరీ ప్లాంట్ హెడ్ ఏవీపీ పట్టాభిరామిరెడ్డి, హెచ్ఆర్ మేనేజర్ వి.మురళీక్రిష్ణ, డీజీఎం కేన్ రాజేంద్రన్ , ప్రిన్స్‌పాల్ ఎం. లక్ష్మి వీటిని విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీ ప్రతినిధులు గవరయ్య, శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా బంగారమ్మ పండుగ

లక్కవరపుకోట: ఎల్.కోటలో గురువారం బంగారమ్మ పండగను గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం బంగారమ్మ భక్తులు ప్రభ, ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. అయిదేళ్లకు ఒకసారి జరిగే పండగ కావడంతో ప్రజలు వేల సంఖ్యలో హాజరయ్యారు.

రెండు పూటలా పనిచేయాలి

రామభద్రపురం: ఉపాధి హామీ పథకం కూలీలు రెండు పూటలా పనిచేసి గరిష్ట వేతనం రూ.272కు చేరుకోవాలని ఏపీవో జి.త్రినాథరావు కోరారు. ఎస్.చింతలవలస గ్రామంలో ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. కొలతలు పూర్తిచేసే విధంగా పనులు చేపట్టాలన్నారు. ఉదయం 6.30 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు విధిగా పనులు చేయాలన్నారు. అనంతరం మస్తర్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీఏ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

బొబ్బిలి: నారాయణప్పవలస-కాశిందొరవలస జంట గ్రామ పంచాయితీలలో ఇందిరాగాంధీ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నిర్వహిస్తున్న సేవాశిబిరంలో భాగంగా గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బలగ అప్పలనాయుడు, పీఓలు పి.రామకృష్ణ, వై.సత్యనారాయణ, ఏఎన్ఎం బంగారమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అంగన్వాడీల ర్యాలీ

బొబ్బిలి: బొబ్బిలి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం పోషణ్ పఖ్వాడా పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు పరిధిలో గల అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్స్‌తో ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాలామణి, అరుణకుమారి, కృష్ణవేణి పాల్గొన్నారు.

అక్రమ బదిలీలను నిలుపుదల చేయాలి

బొబ్బిలి: కౌన్సెలింగ్ విధానానికి నిలువునా తూట్లు పొడుస్తూ అక్రమంగా చేపట్టిన ఉపాధ్యాయ బదిలీలను వెంటనే నిలుపుదల చేయాలని ఏపీటీఎఫ్ అకడమిక్ రాష్ట్ర కన్వీనరు జేసీ రాజు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సుమారు 1400 మంది ఉపాధ్యాయులకు నగదు, సిఫారసు బదిలీలు చేసి ప్రభుత్వం అనైతికచర్యలకు పాల్పడిందని ఆరోపించారు. దీనిని ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు బంకురు జోగినాయుడు, సీహెచ్‌జే ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

గుడ్ టచ్... బ్యాడ్ టచ్‌పై అవగాహన

తెర్లాం: ఎస్.బూర్జవలస ఎంపీపీ పాఠశాలలో గుడ్ టచ్... బ్యాడ్ టచ్‌లపై మహిళా పోలీసు శివదుర్గ అవగాహన కల్పించారు. విద్యార్థినులు వీటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

మగ్గం వర్క్‌పై శిక్షణ

రాజాం: మిలియం మేయర్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నుంచి 35 మంది సొసైటీ సభ్యులకు మగ్గం వర్క్‌లో శిక్షణ ఇస్తున్నట్టు జీఎంఆర్ వైరెడ్ డైరెక్టర్ ఎం.రాజేష్ తెలిపారు. గురవారం శిక్షణకు ఎంపికైన వారికి అనుమతి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజరు వి.నాగరాజు. సొసైటీ డైరెక్టర్ సిస్టర్ హెల్మా హిల్డా ఎడ్యుకేషన్ డైరెక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

సూర్యనారాయణ మృతి తీరని లోటు

జామి: మండల టీడీపీ ఉపాధ్యక్షుడు చుక్క సూర్యనారాయణ మాస్టారు మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే లలితకుమారి అన్నారు. గురువారం ఉదయం గుండెపోటుతో మృతిచెందిన మాస్టారు మృతదేహం వద్ద లలితకుమారి నివాళులు అర్పించి... కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు, మండల పార్టీ కార్యదర్శి రమణ, శంకర్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి



ర్యాలీ చేస్తున్న రైతు సంఘాల నాయకులు

బెలగాం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతు న్న రైతు వ్యతిరేక కార్యక్రమాలను ప్రతిఒక్కరూ ఖండించా లని సంయుక్త కిషాన్ మోర్చా జిల్లా కన్వీనర్ బంటు దాసు అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ సంయుక్త కిషాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపులో భాగంగా గురువారం పార్వతీపురంలోని గురజాడ అప్పారావు విగ్రహం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ చేసి, మానవహారం చేపట్టారు. ఇప్పటికైనా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్పందించి స్వామినాథ్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, పంటలకు మద్దతు ధర ప్రకటించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలు రైతు సంఘాల, కార్మిక సంఘాల నాయకులు గేదెల సత్యనారాయణ, వెంకటనాయుడు, బాషా, బి.నర్సింగరావు, పి.సంగం, జీవ, రంజిత్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అప్రమత్తంగా ఉండండి

గరుగుబిల్లి: ఎన్నికల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్, జేసీ శోభిక సూచించారు. గురువారం మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడితే తదుపరి నిబంధనలు పక్కాగా నిర్వహించాలన్నారు. అర్హులైన వారు ఓటర్లుగా నమోదుకు అవకాశం ఉందని, సంబంధిత బీఎల్వోలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో పార్టీలకు చెందిన ప్రచార సామగ్రిని తొలగించాలని, అలాగే విగ్రహాలకు ముసుగులు వేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పథకాలకు సంబంధించి వాల్ పోస్టర్లను తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, తహసీల్దార్ కె.జయ, ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

వివాదాలకు పోవద్దు



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ

భామిని: ఎన్నికల సమయంలో వివాదాలకు వెళ్లి చెడ్డ పేరు తెచ్చుకోవద్దని బత్తిలి ఎస్ఐ సీహెచ్ ప్రసాద్ గ్రామస్థులకు సూచించారు. నేరడి గ్రామాన్ని ఆయన గురువారం రాత్రి సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. ఇప్పటికే నేరడి వివాదాస్పద గ్రామంగా గుర్తించారని, దీనిపై ప్రతిఒక్కరి దృష్టి ఉంటుందని చెప్పారు. ఎన్నికల సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్, ఇతర పోలీస్ సిబ్బంది పహ రా ఉంటుందన్నారు. ఎల్లమ్మయాత్ర 17 నుంచి ప్రారంభం కావడంతో ఎన్నికల కోడ్ ముందుగానే వస్తే ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతులు ఉండవని చెప్పారు. గతంలో వివాదంలో పాల్గొన్న బాధితులు గుంపుగా రాకుం డా 9 మంది సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో సంతకాలు చేయాలని సూచించారు.

ఆదాయ వనరులపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన వనరులపై దృష్టి సారించాలని ఉల్లిభద్ర డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల అధ్యాపకురాలు ఇ.రేఖ సూచించారు. గురువారం మండలంలోని సంతోషపురం, సుంకి పంచాయతీల్లో ఉద్యాన విలువ ఆధారిత పదార్థాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మన గ్రామం - మన విశ్వ విద్యా లయం కార్యక్రమంలో భాగంగా దత్తత గ్రామాల్లో జాతీయ సేవా పథకం ఆధ్వర్యం లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అరటి నుంచి చిప్స్ తయారీ, అలాగే మొక్కలు అంటే కట్టే విధానాలపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ బి.ప్రసన్నకుమార్, అధ్యాపకులు డాక్టర్ ఆర్.రాజ్యలక్ష్మి, బి.హరిరామకుమార్, ఎ.హిమబిందు, ఎన్ఎస్ఎస్ కార్యక్రమం అధికారితో పాటు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే రక్తహీనత దూరం




పౌష్టికాహార ఆవశ్యకతపై ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

కొమరాడ: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత దూరమవుతుందని కొమరాడ ఐసీడీఎస్ పీవో జి.సుగుణకుమారి అన్నారు. గురువారం ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులతో పౌష్టికాహార వారోత్సవాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపం వల్లే రక్తహీనత ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు తెలిపారు. మండల కేంద్రంలో రహదారులకు ఆనుకుని ఉన్న వ్యర్థాలు తొలగింపును ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి తరలించాలని సూచించారు. మండల కేంద్రంలో సంపద కేంద్రం అందుబాటులో లేకపోవడంతో రాచప్ప చెరువు ప్రాంతంలో వ్యర్థాలను వేస్తున్నారన్నారు. ఈ వ్యర్థాలను వేరే ప్రాంతంలో వేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పంచాయతీల కార్యదర్శులు చెత్త తరలింపుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ పరిశీలనలో కార్యదర్శి డి.జగదీశ్వరరావు ఉన్నారు.

కొలతల మేరకు పనులు నిర్వహించాలి



గొట్టివలసలో మస్తర్లు పరిశీలిస్తున్న అధికారులు

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో ఉపాధి పనులకు సంబంధించి కొలతల మేరకు పనులు నిర్వహించాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ సూచించారు. మండలంలోని గరుగుబిల్లి, గొట్టివలసలలో నిర్వహిస్తున్న పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి నిబంధనలను విధిగా క్షేత్రస్థాయిలో అమలుపర్చాలన్నారు. రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. హాజరుకాని వారికి మస్తర్లు వేసినట్లయితే చర్యలు తప్పవన్నారు. ఈ పరిశీలనలో ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు, క్షేత్ర సహాయకులు ఎన్.సూర్యనారాయణ ఉన్నారు.

సీఎం సహాయ నిధి అందజేత

పాలకొండ: సీఎం సహాయ నిధి నుంచి తంపటాపల్లికి చెందిన బొమ్మాళి సింహాచలానికి రూ.5లక్షలు, చింతాడకు చెందిన రామదాసు, గోవిందరావుకు రూ.30వేలు, భామిని మండలం గురండి గ్రామానికి చెందిన శివ్వాల సంపత్‌కుమా ర్‌కు రూ.2లక్షలు, పాలకొండ నగర పంచాయతీ మేదర వీధికి చెందిన బొనగిరి చిన్నమ్మడుకు రూ.50వేలు మంజూరయ్యింది. బూర్జ మండలం డొంకలపర్తకు చెందిన వాకమూడి దేవీ ప్రసాద్‌కు రూ.32 వేలు, రేగిడి మండలం కందిశ గ్రామా నికి చెందిన వంజరాపు ప్రశాంతకు రూ.2లక్షలు, వెలగవాడ గ్రామానికి చెందిన కొత్తకోట శ్రీనివాసరావు రూ.70వేలు, కొత్తూరుకు చెందిన బూరాడ విద్యాసాగర్‌కు రూ.లక్ష మంజూరయ్యింది. ఈ చెక్కులను శాసనమండలి ప్రభుత్వ విప్ పాలవ లస విక్రాంత్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, వైసీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం చేతులమీదుగా గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి తలే రాజేష్ పాల్గొన్నారు.

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

- టీడీపీ-జనసేన నాయకుల పిలుపు
- గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

గెలుపే ధ్యేయంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని టీడీపీ, జనసేన నాయకులు పిలుపునిచ్చారు. గురువారం జిల్లాలోని వివిధ గ్రామాల్లో పర్యటించి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

గిరిజనులకు ఒరిగిదేమిటి?

సాలూరు రూరల్: సాలూరు నియోజకవర్గానికి 18 ఏళ్లు ఎమ్మెల్యేగా, ప్రస్తుతం గిరిజన శాఖా మంత్రిగా ఉన్న రాజన్నదొరతో గిరిజనులకు ఒరిగిందేమి లేదని టీడీపీ అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి ధ్వజమెత్తారు. ఆమె గురువారం పెదమారయ్యపాడులో బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో గిరిజనులతో కలిసి ర్యాలీ చేశారు. రాజన్నదొర గిరిజనుల అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆముదాల పరమేశు, ఖరాసవలస ఎంపీటీసీ అప్పికొండ రమాదేవి, శ్యాం తదితరులు పాల్గొన్నారు. పెదమారయ్యలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. బెటుకూరి తిరుపతి, మాజీ సర్పంచ్ బెటుకూరి చంద్రయ్య తదితరులకు ఆమె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

టీడీపీలో చేరిక

సాలూరు: రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపే ధ్యేయంగా పని చేస్తామని వెలమపేటకు చెందిన పలు కుటుంబాలకు చెందిన సభ్యులు ముక్తకంఠంతో తెలిపారు. గురువారం సాలూరులో ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి ఆధ్వర్యంలో వెలమపేటకు చెందిన వంద కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. కర్రి సూర్యనారాయణ, సింగనపల్లి తౌడు, లక్ష్మణ, మోహన్, అక్యాన హేమంత్, నాళం సన్ని, కటిక త్రినాథతో పాటు పలువురు మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో సంధ్యారాణి గెలుపు ఖయమని అన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టణం మార్పు కోసం నియోజకవర్గ అభివృద్ధి కోసం తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ నాయకులు నిమ్మాది తిరుపతిరావు, వైకుంఠపు హర్షవర్ధన్, కేతిరెడ్డి చంద్ర, గాయత్రీదేవి, అక్యాన అప్పారావు, ప్రసాదరావు, లక్ష్మణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: విజయ సంకేతం చూపిస్తున్న జగదీశ్వరి

- గుమ్మలక్ష్మీపురం: కురుపాం నియోజకవర్గంలో టీడీపీ, బీజేపీ, జనసేన, ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో మండలంలోని మూలబిన్నిడి గ్రామం నుంచి 70 కుటుంబాలు, చాపరాయి బిన్నిడి నుంచి 50 కుటుంబాలు టీడీపీలో గురువారం చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి జగదీశ్వరి సాదరంగా ఆహ్వానించారు. భావితరాల భవిష్యత్తు కోసం రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాడి సుధాకర్, కె.దాసు, ధర్మా, అనీల్, బలరాం, ఆమిటి, రామారావు, కళావతి, సుమన్, భాస్కరరావు, బాల, దుర్గాప్రసాద్, జీవన్‌కుమార్, కేశవ్, నరసింహ, చందు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.
- రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి కోరారు. మండలంలోని మూల బిన్నిడి, చాపరాయి, బిన్నిడి గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. మూలబిన్నిడి గ్రామం నుంచి 70 కుటుంబాలు, చాపరాయిబిన్నిడి నుంచి 50 కుటుంబాలు టిడిపిలో చేరారు. ఈ కార్య క్రమంలో టిడిపి నాయకులు పాడి సుదర్శరావు, దాసు, ధర్మ, కళావతి, అనీల్, బలరాం, రామారావు పాల్గొన్నారు.



సాలూరు: కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సంధ్యారాణి

పూలమాలలతో స్వాగతం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లా కేంద్రంలో టీడీపీ అభ్యర్థి బోనెల విజయచంద్ర గురువారం ప్రచారం నిర్వహించారు. 21వ వార్డులో ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై వివరించారు. విజయచంద్రకు పూలమాలలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుల బడే గౌరునాయుడు, నారాయణరావు, బార్నాల సీతారాం, హనుమంతు శంకర్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కురుపాం రూరల్: తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థి తోయిక జగదీశ్వరి గురువారం రస్తాకుంటుబాయి, తోటగూడ, సుక్కుగాడి గ్రామాల్లో సూపర్ సిక్స్ కార్యక్రమంపై ప్రచారం చేశారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్, పార్టీ కన్వీనర్ కలిశెట్టి కొండయ్య, కోలా రంజిత్‌కుమార్, కళావతి, మాసయ్య తదితరులు పాల్గొన్నారు.

- సీతానగరం: బలిజిపేట మండలంలోని నారంనాయుడువలస, గంగాడ గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పెంకి వేణుగోపాల్‌నాయుడు ఆధ్వర్యంలో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో రామ్మోహనరావు, రామారావు, సూర్య నారాయణ పాల్గొన్నారు.
- సీతంపేట: రాష్ట్రంలో రానున్నది తెలుగుదే శం ప్రభుత్వమేనని టీడీపీ పాలకొండ నియోజకవర్గ సీనియర్ నాయకురా లు పడాల భూదేవి స్పష్టం చేశారు. గురువారం సీతంపేటలో ఆమె గురువా రం పర్యటించి, సూపర్‌సిక్స్ పథకాలపై వివరించారు. నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బిడ్డిక జయలక్ష్మి, మాజీ కో-ఆప్షన్ నెంబర్ మోహన్‌రావు, సూర్యం, బిగ్‌బాస్ పాల్గొన్నారు.



పార్వతీపురం: విజయచంద్రకు స్వాగతం పలుకుతున్న దృశ్యం



సీతంపేట: ప్రచారం చేస్తున్న పడాల భూదేవి

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

పాలకొండ: పట్టణంలోని జనసేన కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం గురువారం నిర్వహించారు. జనసేన నియోజకవర్గం నాయకుడు కూరంగి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జనసేన జెండాను ఆవిష్కరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం కలిసి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



జనసేన పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాఠశాలల ప్రగతిని తెలియజేయాలి

పాలకొండ: జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాల పనితీరు అభివృద్ధి చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ మాస్టర్ ట్రైనీలు కె.జనార్ధనరావు, కె.గడ్డెయ్య, బి.శ్రీనివాస్, విశ్వేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం హెచ్‌ఎంలకు సోషల్ ఆడిట్‌పై శిక్షణ అందించారు. మూల్యాంకనం, వసతి సదుపాయాలు, ఉపాధ్యాయుల పనితీరు సహా పాఠ్య కార్యక్రమాలు, విద్యార్థుల హక్కులపై వివరించారు. ఈ కార్యక్రమంలో సీఎంవో కె.రాజారావు పాల్గొన్నారు.

మొండెంఖల్‌లో గ్రంథాలయం ప్రారంభం

కురుపాం రూరల్: పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు మేలు చేకూర్చే విధంగా మొండెంఖల్ గ్రామంలో ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని సర్పంచ్ ఇంటికుప్పల గౌరీశంకర్ గురువారం ప్రారంభించారు. వివిధ రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచారు.

చేయూత చెక్కుల పంపిణీ

వీరఘట్టం: మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పాల్గొని, లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయప్రకాష్, ఎంపీడీవో ఎంవీబీ సుబ్రహ్మణ్యం, ఏపీఎం శివున్నాయుడు, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు సుజాత, ఎంపీపీ దమలపాటి రమణనాయుడు, జడ్పీటీసీ జంపు కన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

కొత్త లైన్‌పై రైలు



పార్వతీపురం రైల్వే స్టేషన్‌లో ఆగిన కొత్త రైలు

పార్వతీపురం టౌన్: జిల్లాలో చేపడుతున్న మూడో లైన్ పనులను ఆ శాఖ సేఫ్టీ కమిషనర్ బ్రిజేష్‌కుమార్ మిశ్రాతో పాటు డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్ పరిశీలినంతరం గురువారం ఒడిసాలోని జిమిడి పేట నుంచి పార్వతీపురం వరకు కొత్తలైన్‌పై రైలు పరుగులెట్టింది. సేఫ్టీ కమిషనర్‌తోపాటు డీఆర్ఎం సిబ్బంది జిమిడిపేట నుంచి పార్వతీపురం స్టేషన్ వచ్చే వరకు నూతన రైలు 110 కిలో మీటర్ల వేగంతో ప్రయాణాన్ని పరిశీలించారు. అలాగే జిమిడిపేట నుంచి కూనేరు రైల్వే స్టేషన్ల మధ్య రైలు వేగాన్ని అధికారులు పరిశీలించారు.

వినియోగదారులకు అండగా విద్యుత్ ఫోరం

పాలకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి తమ ఫోరం అండగా ఉంటుందని అధ్యక్షుడు బి.సత్యనారాయణ అన్నారు. పాలకొండలో గురువారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయవచ్చునన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పరిధిలో 2016 నుంచి ఇప్పటివరకు 17 కేసులకు సంబంధించి రూ.69వేలు నష్టపరిహారం విద్యుత్ వినియోగదారులకు చెల్లించామని చెప్పారు. ఈ సమావేశంలో పలువురు వినియోగదారులు తమ సమస్యలపై అర్జీలను సమర్పించారు. అనంతరం తమ్మినాయుడు కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు.

బైకు ఢీకొని యువకుడికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం: రోడ్డుపై నడుస్తున్న పాదచారులను బైకిస్టు ఢీకొన్న ఘటనలో ఒక యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఏకలవ్య పాఠశాల వైపు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న పాలక వినయ్, బిడ్డిక నవీన్, కార్తీక్ అనే ముగ్గురు యువకులను గుణుపూర్ నుంచి గుమ్మలక్ష్మీపురం మండలం రెల్ల గ్రామం వైపు వస్తున్న బైకిస్ట్ ఎదురుగా ఢీకొట్టాడు. దీంతో వినయ్ కాలికి తీవ్ర గాయమయ్యింది. ఆ యువకుడిని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించిన వెంటనే మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ప్రజలకు సేవలందించేందుకే సచివాలయ వ్యవస్థ

- విద్యా శాఖ మంత్రి బొత్స

వీరఘట్టం: ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించేందుకే సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చామని రాష్ట్ర విద్యా శాఖామంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గురువారం కిమ్మి గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ.40లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.80లక్షలు అంచనాతో నిర్మించిన ఆర్బీకేను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో కల్పనాకుమారి, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎంపీపీ దమలపాటి వెంకటరమణ, జడ్పీటీసీ జంపు కన్నతల్లి, సర్పంచ్ గురాన రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కిమ్మి-రుషింగి వంతెన ప్రారంభం

వీరఘట్టం-వంగర మండలాలకు అనుసంధానం చేసే కిమ్మి-రుషింగి గ్రామాల మధ్య 27.5 కోట్ల అంచనా వ్యయంతో నాగావళి నదిపై హైలెవెల్ వంతెనను మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు.

ఈబీసీ నేస్తం మూడో విడత నిధులు విడుదల

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఈబీసీ నేస్తం పథకం కింద మూడో విడత నిధులు విడుదలయ్యాయని జాయింట్ కలెక్టర్ శోభిక అన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. 45 సంవత్సరాల వయస్సు నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న మహిళలకు సంవత్సరానికి రూ.15వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంత లబ్ధిదారుల కుటుంబ నెలసరి ఆదాయం రూ.10వేలు మించరాదని, పట్టణ ప్రాంతాల్లో రూ.12వేలు మించరాదని వివరించారు.

బాల్య వివాహాలు నేరం

పార్వతీపురం రూరల్: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని నర్సిపురం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పురుషోత్తం అన్నారు. గురువారం ఆ పాఠశాలలో జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు చదువులే ముఖ్యమని, బాల్య వివాహాలు జరిపి వారి భవిష్యత్తును పాడుచేయవద్దన్నారు. లీగల్, ప్రొబేషన్ జిల్లా అధికారి శ్రీధర్ పిల్లల హక్కులు, బాధ్యతలపై వివరించారు.

ఏరియా ఆస్పత్రిలో శస్త్రచికిత్స పరికరాల ప్రారంభం

సాలూరు: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఎముకలకు సంబంధించిన శస్త్రచికిత్స పరికరాలను డిప్యూటీ సీఎం రాజన్నదొర గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి సుమారు రూ.9కోట్ల నిర్మాణం జరిగిందని, ఇంకా రూ.8కోట్లతో పనులు జరగాల్సి ఉందని చెప్పారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మహిళలను అన్ని రకాలుగా ప్రోత్సహించాలి

సాలూరు: మహిళలను అన్ని రకాలుగా ప్రోత్సహించాలని డీఎస్పీ హర్షితాచంద్ర కోరారు. పట్టణంలో గిరిశిఖర గ్రామాల గర్భిణుల వసతి గృహంలో గురువారం నీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. నీడ్ డైరెక్టర్ వేణుగోపాలరావు మాట్లాడుతూ మహిళలను గౌరవించటం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ హర్షితాచంద్ర

ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో చేపలవేట



చేపలు పట్టిన దృశ్యం

సీతంపేట: ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్ చెరువులో గురువారం చేపలవేట నిర్వహించారు. వైఎస్సార్ మత్స్య, సాగుబడి కార్యక్రమంలో భాగంగా విడిచి పెట్టిన చేపలను మత్స్యశాఖ ఆధ్వర్యంలో పట్టారని ఎఫ్‌డీవో గోపీకృష్ణ తెలిపారు. సుమారు 150 కేజీలు చేపలను పట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ అసిస్టెంట్ విజేత తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించకపోతే నీటి సరఫరా నిలిపేస్తాం

- పంప్‌హౌస్ కార్మికుల ఆందోళన

నెల్లిమర్ల: ఎనిమిది నెలల కాలంగా బకాయిపడిన తమ జీతాలను సోమవారంలోగా చెల్లించకపోతే మంగళవారం అర్ధరాత్రి నుంచి మంచినీటి సరఫరా నిలిపివేస్తామని రామతీర్థం, ముషిడిపల్లి పంప్ హౌస్ కార్మికుల యూనియన్ నాయకులు ఎ.జగన్మోహనరావు, మురళి, అరుణ స్పష్టం చేశారు. స్థానిక పంప్ హౌస్ వద్ద గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. తప్పనిసరి పరిస్థితుల్లో తాము ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. శుక్రవారం నల్ల రిబ్బన్లతో విధులకు హాజరవుతామని, శనివారం మేయర్, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందజేస్తామని, సోమవారం విజయనగరం మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నాచేస్తామని వివరించారు. అప్పటికీ జీతాలు చెల్లించకపోతే మంగళవారం అర్ధరాత్రి నుంచి మంచి నీటి సరఫరా నిలుపుదల చేస్తామని స్పష్టంచేశారు. ప్రజలకు జరిగే అసౌకర్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణరావు, రాంబాబు, రమేష్, శ్రీను, కృష్ణ, గోవింద్, స్వామి, సత్యనారాయణ, బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.